క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నవాబుపేట: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ల వాడకంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ పురుషోత్తం సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రుణాలు ఇస్తామని, తదితర లింక్‌లతో మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. బ్యాంకు, ఓటీపీ వివరాలు తెలుపవద్దని తెలిపారు.

వివరాలు తెలపండి

నవాబుపేట: మార్చి నెలలో గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన సమాచారం ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని ఈఓపీఆర్‌డీ భద్రునాయక్ తెలిపారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సమావేశంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమాచారంతో రావాలని సూచించారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

నవాబుపేట: మైసమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆయిల్‌పాం సాగు పరిశీలన

కోయిల్‌కొండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం ఖమ్మం జిల్లా ఆశ్వారావుపేటలో సాగుచేస్తున్న ఆయిల్ పాం పంటలను పరిశీలించారు. పంటల నుంచి వచ్చే గింజల ద్వారా నూనె ఎలా తీయాలి, ధర, లాభాలు, నష్టాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు భీంరెడ్డి, రాజిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగన్న, కృష్ణయ్య, రవికిరణ్, నవీన్, రాజవర్ధన్‌రెడ్డి, చెన్నారెడ్డి, రవీందర్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.శివకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు మధు, రమేష్, ఆనంద్, హరి, నరేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్‌గౌడ్, ఎల్లన్న, హాజీ, మహబీన్, మహమూద్, శివకుమార్‌గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీకల్లు నివారణకు చర్యలు తీసుకోవాలి

పాలమూరు: జిల్లా కేంద్రంలో కల్తీ కల్లు, కల్తీ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మన పాలమూరు అభివృద్ధి ఫోరం సభ్యులు ఆదివారం ఎక్సైజ్ సీఐ వీరారెడ్డికి వినతిపత్రం అందించారు. కల్తీకల్లు తయారీ, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు మున్నూర్ రవి, విశ్వనాథ్ రావు భాండేకర్, వర్ధ యాదయ్య, పటేల్ వెంకటేష్, ఆంజనేయులు, మహేష్, రాకేష్ పటేల్, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబీకురాలైన బోయిని మల్లమ్మ మృతిచెందడంతో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ట్రస్టు ద్వారా ఆమె కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కేశవులు, వేణు, వెంకటయ్య, నర్సింహులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరుమోటార్ ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఆదివారం బోరు మోటార్‌ను చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మినీట్యాంక్ నిర్మించి బోరు వేయించి మోటార్‌ను అమర్చారు. వార్డు కౌన్సిలర్లు బుక్క మహేష్, చైతన్య చౌహాన్, ఏఎంసీ డైరెక్టర్ పోల వినోద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహారం పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈస్టర్ పండుగను పురస్కరించుకొని స్థానిక దాసరి సోదరులు ఆదివారం నిరుపేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల నుంచి క్రిస్మస్, ఈస్టర్ పండుగ రోజుల్లో నిరుపేదలకు ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు. దాదాపు 250మంది నిరుపేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాసరి సుందర్, డీఆర్‌పీ ప్రసాద్, దాసరి ప్రభాకర్, కాంతి కిరణ్, బెంజిమెన్, మెల్కిసెదక్ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మహమ్మదాబాద్: బైకుపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి తీవ్ర గాయాలైన సంఘటన నంచర్ల గేట్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మద్దూర్ మండలంలోని వీరారం గ్రామానికి చెందిన భద్రునాయక్ శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో మహబూబ్‌నగర్ నుంచి కోస్గి వైపు వెళ్తున్నాడు. నంచర్ల గేట్ సమీపంలోని రైస్‌మిల్ వద్ద బైకు అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 ఈఎంటీ మాధవులు, పైలెట్ అక్బర్ ప్రథమ చికిత్స చేసి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న పాస్టర్ ఏసుబాబు



జడ్చర్లలో కల్వరికొండపై ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జడ్చర్ల టౌన్: ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించటమే క్రైస్తవమని రెవరెండ్ ఏసుబాబు సందేశమిచ్చారు. ఆదివారం ఈస్టర్ వేడుకల సందర్భంగా పట్టణంలోని కల్వరికొండపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మరణమును జయించిన జయశీలుడు క్రీస్తు మన కొరకు మరణించి తిరిగి లేచాడన్నారు. ఆయన చూపిన శాంతి, ప్రేమ, క్షమా గుణాలను అనుసరిస్తూ సమాజంలో నడుచుకోవాలన్నారు. సూర్యోదయ ఆరాధన అనంతరం ఎంబీ బేథని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ విలియం బూత్, చర్చి అధ్యక్షుడు బెంజిమెన్, కార్యదర్శి దేవదానం, కోశాధికారి తిమోతి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం పెద్దలు, మహిళలు, యువకులు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. పలుగు గుట్టపై క్రీస్తు పునరుత్థానం సువార్తను పాస్టర్ చంద్రశేఖర్ వివరించారు. అనంతరం ఆరాధన నిర్వహించారు.



అడ్డాకులలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

పనులు పూర్తయ్యే వరకు సమీక్ష

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ, నెక్లెస్‌రోడ్డు, సస్పెన్షన్ బ్రిడ్జి, ఐలాండ్ పనులు పూర్తయ్యేవరకు రోజూ సమీక్షిస్తానని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. వరుసగా మూడో రోజూ ఆదివారం ఈ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ వాహనాలు పెట్టి పెద్దచెరువులోని పూడకను త్వరగా తరలించాలని అధికారులకు సూచించారు. కృష్ణానది నీటితో నింపేందుకు సిద్ధం చేయాలన్నారు.



మినీ ట్యాంక్‌బండ్ వద్ద పనులు పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

మహబూబ్‌నగర్ రూరల్: సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని, గడప గడపకూ ప్రభుత్వ పథకాలు చేరాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పోతన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఇటీవల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారని తెలిపారు. తమ పార్టీలో చేరిన విషయంపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని గమనించాలని సూచించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. సమావేశంలో ముడా డైరెక్టర్ ఆంజనేయులు, రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ మస్తాన్, నాయకులు అబ్దుల్ ఖాదర్, చెన్నయ్య పాల్గొన్నారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి



ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు కనిపిస్తున్నాయని బీజేపీ నాయకుడు ఎన్పీ వెంకటేష్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని పోతన్‌పల్లిలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పల్లెపల్లెకు ఓబీసీ మోర్చా-ఇంటింటికీ బీజేపీ పథకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్పీ వెంకటేష్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సాగిస్తున్న అరాచకాలు మితిమీరిపోయాయని ఆరోపించారు. తొమ్మిదేళ్ల పాలనలో పేద ప్రజలు పేదలుగానే మిగిలారని, కానీ బీఆర్‌ఎస్ నాయకుల ఆస్తులు పెరిగాయని అన్నారు. ఒక్కసారి బీజేపీ ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, కోశాధికారి పాండురంగారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాజుగౌడ్, నాయకులు జి.గోపాల్, సతీష్‌కుమార్, మల్లేష్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

స్టేషన్ మహబూబ్‌నగర్: బీజేపీ నాయకుడు, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాస గృహంలో ముస్లింలకు ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, అబ్దుల్ హాదీ, జహీర్ అఖ్తర్, మోసిన్‌ఖాన్, నయీం, మౌలానా మొహిసిన్‌పాష ఖాద్రీ, నూరుల్ హసన్, రహెమాన్ రీగల్, అబ్దుల్ జకీ, సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ, ఫక్రు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలి

జడ్చర్ల/బాలానగర్: ధ్యానం ద్వారా ఆరోగ్యం, ఆనందంగా ఉంటామని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బాలకృష్ణా రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్న ఆదిరాల, పెద్ద ఆదిరాల, ఎక్వాయపల్లి గ్రామాల్లో ధ్యానంపై అవగాహన శిబిరాలు నిర్వహించారు. ధ్యానం చేసే విధానం, ధ్యానం చేయడం వల్ల కలిగే ఫలితాలను వివరించారు. మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు మనసిక ఒత్తిడి నుంచి బయట పడగలుగుతామన్నారు. ధ్యానం వల్ల అనేక రుగ్మతల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ప్రతిరోజు ధ్యానం చేయడం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు శ్రీనివాస్, రాంచంద్రయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో జామియా మజీద్ పేష్ఇమాం ముక్తార్ అహ్మద్ ఆదేశాలతో అనిసుల్ గుర్బా ట్రస్టు ద్వారా రంజాన్ పండగను పురస్కరించుకుని ఆదివారం నిరుపేదలకు రంజాన్ ప్యాకేజీలను అందజేశారు. నిరుపేదలు పండగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో 23నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులతో కూడిన ప్యాకేజీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు షేక్ సర్దార్‌పాష, అబ్దుల్ సలాం, అర్షద్, నజిరొద్దీన్, సాధిక్ ఉర్ రెహ్మాన్, బ్రిక్స్ పాష, సలీం, తాజొద్దీన్, ఆజమ్, సాబేర్, ఆబిద్, అన్వర్, ముభీమ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



ఎన్‌ఎస్‌యూఐ సంఘం జెండా ఎగురవేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ 1971లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నేతృత్వంలో ఎన్‌ఎస్‌యూఐ ఏర్పడిందని అన్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌యూఐ నుంచే చాలా మంది నాయకులు జాతీయస్థాయికి ఎదగారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో ఎన్‌ఎస్‌యూఐ ముందుండి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు జహీర్ అఖ్తర్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, నాయకులు బెక్కరి అనిత, సిరాజ్ ఖాద్రీ, అజ్మత్‌అలీ, రమేశ్, పీర్ సాధిక్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ఓబ్లాయిపల్లిలో ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తే ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కోడూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు రాజుగౌడ్ మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మన్యంకొండ శివారులో ఉన్న 85 సర్వేనంబర్‌లో గల భూమి ధరణి పోర్టల్‌లో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. 85 సర్వేనంబర్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తీయించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు కూడా ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. సీసీ రోడ్లు, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలు, పల్లె ప్రకృతివనాలు కేంద్ర ప్రభుత్వ నిధులేనని, తెలియకపోతే అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.

నిరుద్యోగులను విస్మరించిన ప్రభుత్వం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: నిరుద్యోగుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని వైఎస్సార్ టీపీ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆర్.రవిప్రకాష్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిరసన చేపట్టి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవిప్రకాశ్ మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమకు మంచి భవిష్యత్ ఉంటుందని కలలు గన్న నిరుద్యోగుల ఆశలను ప్రభుత్వం వమ్ము చేసిందని ఆరోపించారు. తెలంగాణలో నియంతపాలన కొనసాగుతున్నదని దుయ్యబట్టారు. ఉద్యోగాల భర్తీ అంటూ నిరుద్యోగ యువతను మోసం చేశారని ఆరోపించారు. తక్షణమే బిస్వాల్ కమిటీ ప్రకారం వెంటనే 1.91లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అయ్యప్ప సునీల్, పట్టణ అధ్యక్షుడు మహేందర్‌జీ, నాయకులు పీటర్, అశోక్, రాజు, నవీన్, రాకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

మహబూబ్‌నగర్ రూరల్: దళిత, గిరిజన, బడుగు, బలహీన మైనార్టీలతో పాటు అన్ని వర్గాల అభివృద్ధిని కాంక్షించే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పని చేయాలని టీపీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని అల్లీపూర్‌లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరూ సమిష్టిగా ప్రజల మధ్య ఉంటూ కష్టపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రీ, రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ గోవింద్ యాదవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లు నర్సింహారెడ్డి

10నుంచి బొడ్రాయి ఉత్సవాలు

జడ్చర్ల టౌన్: మే 10నుంచి 12వరకు మూడు రోజుల పాటు బొడ్రాయి ఉత్సవాలు నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఆదివారం పట్టణంలోని పోచమ్మ ఆలయంలో మారుతి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్తులు పాల్గొని బొడ్రాయి ఉత్సవాల తేదీని నిర్ణయించారు. జెడ్పీ హైస్కూల్ సమీపంలో ఉన్న బొడ్రాయి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వార్డు కౌన్సిలర్లు కుమ్మరి రాజు, లత, రఘురాంగౌడ్, నాయకులు కొంగళి జంగయ్య, మోహన్‌రాజ్, రాంచంద్రయ్య, జంగయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

12 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు..



మే 12 నుంచి 14వరకు మున్సిపాలిటీ పరిధిలోని బొంగరాల గుట్ట వద్ద ఉన్న తుల్జాభవాని ఆలయంలో తుల్జాభవాని, మేరిమాయాడి, సంత్‌సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో నిర్ణయించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన బంజారాల ఆత్మీయ సమ్మేళనం వివరాలను గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్ తెలిపారు. బొంగరాల గుట్ట వద్ద ఉన్న స్థలంలో తుల్జాభవాని ఆలయం పూర్తికావచ్చినందునా చండీయాగం, హోమం, దూపదీప నైవేద్యాలతో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుపుకోనున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో గిరిజన సంఘాల నాయకులు శంకర్‌నాయక్, చైతన్య చౌహాన్, తిరుపతి బావాజీ, గోవింద్‌నాయక్, థావుర్య, గోపాల్, థారాసింగ్, బిచ్యానాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం తగదు



మాట్లాడుతున్న సర్పంచ్ బాలామణి

రాజాపూర్: గ్రామాభివృద్ధికి పాటుపడుతుంటే అడ్డుపడడం తగదని కల్లేపల్లి సర్పంచ్ బాలామణి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్లేపల్లిలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించేందుకు గత 2018లో రూ.16లక్షలు మంజూరు అయ్యాయని, ఇందుకు 20 జులై 2019లో గ్రామపంచాయతీ భవనం నిర్మించేందుకు గ్రామంలోనే అనువైన ప్రభుత్వస్థలం సర్వేనంబర్ ఒకటిలో 600 గజాల స్థలంలో భవనం నిర్మించేందుకు పాలకవర్గం తీర్మానం చేసిందని తెలిపారు. పనులు ప్రారంభించేందుకు అధికార పార్టీ నాయకుడు శ్రీశైలం యాదవ్ అడ్డుతగులుతూ మూడేళ్లుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. శనివారం భవనం నిర్మించే స్థలంలో చదును చేయిస్తుంటే అధికార పార్టీ నాయకుడు సర్పంచ్‌నైన తనను దుర్భాషలాడి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వార్డు సభ్యుడు శేఖర్, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం యాదవ్, భరత్, లింగం, రేక్యానాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని జీకే మాస్టర్ షోటోకాన్ ఎగ్జామినర్ ఇలియాజ్ బిన్ సిద్దిఖీ అన్నారు. జీకే కరాటే షోటోకాన్ సీనియర్ మాస్టర్ సయ్యద్ అశ్వాక్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మయూరీ పార్క్‌లో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలియాజ్ బిన్ సిద్దిఖీ మాట్లాడుతూ ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించేవారు చదువులో కూడా ముందుంటారని అన్నారు. గ్రేడింగ్ పరీక్షల్లో 30మంది విద్యార్థులు ప్రతిభచాటి బెల్టులు అందుకున్నారు. నేడు కూడా విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మాస్టర్ తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల బీఆర్‌ఎస్ కౌన్సిలర్ శశికిరణ్, నాయకుడు చంద్రకాంత్, జిల్లా స్పోర్ట్స్ కరాటేడూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అశ్వాక్ పాల్గొన్నారు.



బెల్టులు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 35మంది లబ్ధిదారులకు రూ.12.38లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేసిన ఖర్చులకు సంబంధించి ప్రభుత్వపరంగా అందించే సీఎం సహాయనిధి వరంగా మారిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, నాయకులు రామ్మోహన్, ఇమ్ము, శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

స్థానిక నిమ్మబాయిగడ్డలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందును నిర్వహించడం అభినందనీయమన్నారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో కలిసిమెలిసి పండుగలు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ దానీష్, మసియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్‌లో బలగం సినిమాను ఆదివారం రాత్రి ప్రదర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భారీ తెరను ఏర్పాటు చేసి సినిమాను వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమిస్తాపూర్‌లో..

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ 5వ వార్డులో బలగం సినిమాను ఆదివారం రాత్రి కౌన్సిలర్ కృష్ణవేణి బాలస్వామి ఆధ్వర్యంలో పోషమ్మ ఆలయం వద్ద బలగం సినిమాను ప్రజలకు ప్రదర్శించారు. కార్యక్రమంలో ముడా డైరెక్టర్ బాలస్వామి, కోఆప్షన్ అజీజ్, గ్రామస్తులు ఉన్నారు.

గండేడ్: మండలంలోని రంగారెడ్డిపల్లి, వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శింపజేశారు. పల్లె వాతావరణం కొట్టొచ్చినట్టుగా కనిపించే సినిమాను చూడటానికి ఎంతో మంది ప్రజలు తరలివచ్చారు.



అమిస్తాపూర్‌లో బలగం సినిమాను తిలకిస్తున్న గ్రామస్తులు